క్లుప్తంగా

కబ్జాదారులకు నోటీసులు

సాక్షి ఎఫెక్ట్..

ఇచ్చోడ: రోడ్లను కబ్జా చేస్తున్న ఇద్దరికి సోమవారం నోటీసులు అందజేసినట్లు ఇచ్చోడ పంచాయతీ ఈవో సూర్యప్రకాశ్ తెలిపారు. 'కబ్జాకు గురవుతున్న రోడ్లు' అనే శీర్షికన సాక్షిలో ప్రచురించిన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. రెండు రోజుల్లో షెడ్లను తొలగించాలని, లేదంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అందుబాటులో సోయా విత్తనాలు

నేరడిగొండ: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సోయా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని సంఘం చైర్మన్ సాబ్లే కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. జేఎస్ 335, జెస్ 9305 రూ.2400, జెఎస్ 335 రూ.2300, ఎరువులు 20:20:13 రూ.1150, యూరియా రూ.267, ఎస్ఎస్‌పీ రూ.540 ధర ఉన్నట్లు పేర్కొన్నారు. అవసరమైన రైతులు సంఘం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఆలయాలు



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామన్న

ఆదిలాబాద్: సనాతన ధర్మ ప్రాశస్త్యాన్ని తెలియజెప్పేలా, ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఆలయ నిర్మాణాలు అధికంగా చేపడుతున్నామని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని సాయినగర్‌లో నిర్మించనున్న హనుమాన్ ఆలయ పనులను సోమవారం భూమి పూజ చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, హిందూ ధర్మ విశిష్టతను తెలియజేస్తూ ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలని సూచించారు. ఆలయ నిర్మాణానికి తన వంతు సహకారం అందజేస్తానన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజా రెడ్డి, కౌన్సిలర్ డాక్టర్ లక్ష్మణ్, బీఆర్ఎస్ నాయకులు మహేందర్, దేవిదాస్, శ్రీనివాస్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వెల్‌బేబీ షో

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని సుందరయ్యనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం నిర్వహించిన వెల్‌బేబీ షో ఆకట్టుకుంది. చిన్నారులను అంగన్‌వాడీలను చేర్పించాలని ఈనెల 3 నుంచి ప్రారంభమైన అంగన్‌వాడీ బాట సోమవారంతో ముగిసింది. ఎంపికైన చిన్నారులకు అంగన్‌వాడీ టీచర్ రాధ కిరీటం, పూల మొక్కలను బహుమతిగా అందజేశారు. అంతకుముందు కాలనీలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సంగీత, ఏఎన్ఎం తులసి, ఆశావర్కర్ స్వప్న, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జిల్లా టాపర్లుగా నిలవడం గర్వకారణం

ఆదిలాబాద్‌టౌన్: పాలిసెట్ పరీక్షల్లో జిల్లా విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరచడం జిల్లాకు గర్వకారణమని ప్రభుత్వ సంజయ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ భరద్వాజ అన్నారు. ఇటీవల పాలిసెట్ పరీక్షల్లో ర్యాంకులు సాధించిన విద్యార్థులు అమీన షిరిన్, సమీక్ష, సరితలను సోమవారం కళాశాలలో సన్మానించారు. కార్యక్రమంలో లెక్చరర్లు జ్యోత్స్న, సంగీత, కిషోర్ పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడు తల్లి చెంతకు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని మహాలక్ష్మివాడకు చెందిన బాలుడు సాయికృష్ణ ఆదివారం అదృశ్యం కాగా, సోమవారం తల్లి చెంతకు చేరాడు. బాలుడు తప్పిపోయాడని తండ్రి సంతోశ్ టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని గాలించగా.. బాలుడు రైల్వే స్టేషన్‌లో ఉన్నట్లు గుర్తించారు. ఎస్సై విష్ణుప్రకాష్ బాలుడిని తల్లిదండ్రులను అప్పగించారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

జైనథ్: మండలంలోని కరంజి(కె) గ్రామంలో పల్లెప్రకృతి వనంతో పాటు భీమన్న దేవుడి ఆలయాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని బాబు జగ్జీవన్ రావు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దర్శనాల నగేశ్ డిమాండ్ చేశారు. సోమవారం గ్రామస్తులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పల్లెప్రకృతి వనంలోని దాదాపు 200 మొక్కలను దుండగులు ట్రాక్టర్, జేసీబీ సాయంతో రాత్రివేళ ధ్వంసం చేశారని ఆరోపించారు. పక్కనే ఉన్న భీమన్న దేవుడి ఆలయంలోని విగ్రహాన్ని సైతం పక్కకు తొలగించారని అన్నారు. ఆయన వెంట గ్రామస్తులు గంగన్న, దిలీప్, అశోక్, అరుణ్, నాగన్న, ఆశన్న, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి గ్రహణం

- కనీస సౌకర్యాలు కరువు
- పుస్తకాల గదికి తాళం
- దినపత్రికలకే పాఠకులు పరిమితం



ర్యాకులో ఉన్న పుస్తకాలు



దినపత్రికలు చదువుతున్న పాఠకులు

తాంసి: మండల కేంద్రంలోని గ్రంథాలయం నిరుపయోగంగా మారింది. రెగ్యులర్ లైబ్రేరియన్ లేకపోవడంతో నిత్యం గ్రంథాలయానికి వచ్చే పాఠకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గత నాలుగు సంవత్సరాలుగా లైబ్రేరియన్ డిప్యూటేషన్‌లో భాగంగా జిల్లా కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్నాడు. తాంసి గ్రంథాలయాన్ని అటెండర్ ప్రతీరోజు నామమాత్రంగా తెరిచి దినపత్రికలను మాత్రమే ఉంచుతున్నాడు. రోజంతా గ్రంథాలయానికి తాళం వేసి ఉంటుంది. కేవలం అక్కడకు వచ్చే దినపత్రికల కోసం ఉదయం మాత్రమే తెరుస్తున్నారు. పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు, కాంపిటీషన్ బుక్స్ అందుబాటులో ఉండడం లేదని పాఠకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉపయోగపడని పుస్తకాలు..

యువకులకు, విద్యార్థులకు, పాఠకులకు విద్యపై అవగాహన పెంచడంతో పాటు, మంచి జ్ఞానాన్ని పెంచే పుస్తకాలు ఉన్నాయి. మహనీయుల జీవితాలకు సంబంధించిన పుస్తకాలు ఉన్నా.. ఎవరికీ ఉపయోగపడడం లేదు. లైబ్రేరియన్ లేకపోవడంతో పుస్తకాలు ఉన్న గదికి తాళం వేసి ఉంటుంది. చెదలు పట్టి పాడయ్యే పరిస్థితి నెలకొంది. పుస్తకాల గదికి తాళం ఉండడంతో పుస్తకాలు చదవలేక పోతున్నామని పలువురు వాపోతున్నారు.

ఇన్‌చార్జి లైబ్రేరియన్..

తాంసి గ్రంథాలయానికి లైబ్రేరియన్‌గా విధులు నిర్వహిస్తున్న లైబ్రేరియన్‌కు జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో ఇన్‌చార్జిగా విధులు అప్పగించారు. దీంతో లైబ్రేరియన్ గతంలో ప్రతినెల ఒకటి రెండు సార్లు వచ్చి వెళ్తు అక్కడ, ఇక్కడ విధులు నిర్వర్తించేవారు. గత సంవత్సర కాలంగా లైబ్రేరియన్ గ్రంథాలయానికి రాకపోవడంతో నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. కేవలం పేపర్ బిల్లులు, వార, మాస పత్రికల బిల్లులు, అటెండర్ జీతం చెల్లించేందుకు మాత్రమే ఇన్‌చార్జి లైబ్రేరియన్ విధులు నిర్వర్తిస్తున్నాడని, నెలకు ఒక్కరసారి మాత్రమ వస్తున్నాడని స్థానికులు పేర్కొంటున్నారు.

లైబ్రేరియన్‌ను నియమించాలి

నాలుగేళ్ల క్రితం తాంసి గ్రంథాలయానికి లైబ్రేరియన్‌గా ఉన్న అధికారిని జిల్లా కేంద్రంలో గ్రంథాలాయానికి ఇన్‌చార్జిగా నియమించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు అధికారిని కేటాయించలేదు.లైబ్రేరియన్ లేక తాంసి గ్రంథాలయంలో ఉన్న అటెండర్‌తోనే గ్రంథాలయాన్ని కొనసాగించాల్సిన పరిస్థితి ఉంది.

– రజనీకాంత్‌రెడ్డి, తాంసి

దినపత్రికలు మాత్రమే



గ్రంథాలయంలో దినపత్రికలు తప్ప ఇతర పుస్తకాలు అందుబాటులో ఉండడం లేదు. జ్ఞానంతో పాటు కాలాక్షేపం కోసం వివిధ పుస్తకాలను చదవడానికి వస్తే పుస్తకాలు అందుబాటులో ఉండడం లేదు. పుస్తకాల గదికి తాళం వేసి ఉండడంతో దినపత్రికలు చదవాల్సి వస్తోంది.

– సంతోశ్‌కుమార్, తాంసి

సమస్యలు పరిష్కరించాలి

- సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే రేఖానాయక్
- ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులపై సభ్యుల ఆగ్రహం



వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రేఖానాయక్

ఉట్నూర్‌రూరల్: గిరిజన ప్రజల సమస్యలు పరిష్కరించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అధికారులకు సూచించారు. చిన్నచిన్న పనుల వల్ల గ్రామాలకు నీటి సరఫరా కాకపోవడంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఎంపీడీవో సమావేశ మందిరంలో ఎమ్మెల్యే అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి గ్రామాల అభివృద్ధికి తోడ్పాటునందిస్తుందన్నారు. మిషన్ భగీరథ, విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. లింగోజీతండా సర్పంచ్ హరినాయక్ మాట్లాడుతూ.. విద్యుత్‌శాఖ ఏఈకి ఎన్నిసార్లు విన్నవించినా.. ఎలాంటి ఫలితం లేదన్నారు. లక్కారం సర్పంచ్ జనార్దన్ మాట్లాడుతూ.. భగీరథ పైప్‌లైన్లు పైపైన వేస్తున్నారని తెలిపారు. అదేవిధంగా పశుసంవర్ధక, అటవీ, విద్య, వైద్య శాఖల ద్వారా సమాచారం అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఎంపీపీ జైవంత్ రావు, వైస్ ఎంపీపీ దావులే బాలాజీ, ప్యాక్స్ చైర్మన్ ఎస్సీరెడ్డి, ఎంపీడీవో తిరుమల, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గడపగడపకూ కాంగ్రెస్



కోట(కె)లో పర్యటిస్తున్న ఆడె గజేందర్

బోథ్: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు అందజేస్తామని నియోజకవర్గ నాయకులు ఆడె గజేందర్ అన్నారు. గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని కోట(కె)లో పర్యటించారు. బీఆర్ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కుర్మె మహేందర్, నియోజకవర్గ మైనారిటీ కార్యదర్శి నాసర్ అహ్మద్, భోజన్న, గుడాల శేఖర్, రాజశేఖర్, పవన్, రామాయి రాములు, అనిల్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు ప్రజలు గుణపాఠం చెబుతారు

ఆదిలాబాద్‌టౌన్: ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీఆర్ఎస్‌కు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని ఏఐసీసీ సభ్యురాలు గండ్రత్ సుజాత అన్నారు. సోమవారం ఆదిలాబాద్ పట్టణంలోని రాంపూర్ కాలనీలో గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వరంగల్ రైతు డిక్లరేషన్, సరూర్‌నగర్ యూత్ డిక్లరేషన్ గురించి ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.500కే సిలిండర్, ఇల్లులేని నిరుపేదలకు రూ.5 లక్షలతో ఇంటి నిర్మాణాలు చేపడతామని హామీఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సంజీవ్ రెడ్డి, అశోక్, ప్రభాకర్, వసీమ్, సుదర్శన్, ముర్తుజ, విఠల్, రవి పాల్గొన్నారు.

బడీడు పిల్లలను పనులకు పంపొద్దు



విద్యార్థులతో క్షమా దేశ్‌పాండే

బేల: బడీడు పిల్లలను పనులకు పంపొద్దని జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి క్షమాదేశ్ పాండే అన్నారు. మండలంలోని భవానీగూడ(సి)లో జిల్లా న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ముందుగా విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బడీడు పిల్లలను ప్రతిరోజు కచ్చితంగా బడికి పంపేలా తల్లిదండ్రులు చూడాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దడంజే కేశవ్‌రావు, ఉప సర్పంచ్ పోతు, పంచాయతీ కార్యదర్శి చంద్రబాగ, మహిత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాల కార్మికుల నిర్మూలనకు కృషి చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: బాల కార్మికుల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జువేనల్ జస్టిస్ బోర్డు చైర్‌పర్సన్, ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ మంజుల సూర్యవార్ అన్నారు. సోమవారం ఆదిలాబాద్ పట్టణంలోని బాలరక్ష భవన్‌లో మహితా, సెడ్స్ స్వచ్ఛంద సంస్థ, బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. కుటుంబ పరిస్థితుల కారణంగా చిన్నారులు బాల కార్మికులుగా మారుతున్నారని అన్నారు. బడీడు పిల్లలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్మన్ వెంకటస్వామి, అడిషనల్ ఎస్పీ శ్రీనివాస, దశరథ్, సమీరుల్లా ఖాన్, రాజేంద్రప్రసాద్, రాజలింగం, వినోద్, శ్రీకాంత్, త్రివేణి, తిరుపతి పాల్గొన్నారు.

'ప్రైవేట్ వద్దు.. ప్రభుత్వమే ముద్దు'



ఇంటింటా ప్రచారం చేస్తున్న సర్పంచ్ మీనాక్షి

ఇచ్చోడ: విద్యార్థులను ప్రైవేట్ పాఠశాలలకు పంపవద్దని, ప్రభుత్వ పాఠశాలకే పంపాలని ముఖరా(కె) సర్పంచ్ గాడ్గే మీనాక్షి అన్నారు. సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బడీడు పిల్లల ఇంటికి వెళ్లి.. బ్యాగు, పలక అందచేసి బడీలో చేర్పించారు. సర్కార్ బడిలో నాణ్యమైన విద్యతో పాటు ఉచితంగా భోజనం, రెండు జతల యూనిఫాం, ఉచిత పుస్తకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గాడ్గే సుభాష్, ఉపాధ్యాయులు సురేఖ, వినత, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

ఇంద్రవెల్లి: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని పిట్టబోంగరం దిశ మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు రవిబాబు అన్నారు. సోమవారం మండలంలోని పిట్టబోంగరంలో బడిబాట నిర్వహించారు. పాఠశాలల్లో కలిస్తున్న సౌకర్యాలపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివాజీ, ఆడే జైవంత్‌రావ్, సుభాష్, ఆత్రం జగదీష్ పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే, డీసీసీబీ చైర్మన్

తాంసి: రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. సోమవారం మండలంలోని గిరిగాం, భీంపూర్ మండలంలోని అర్లి(టి) గ్రామాల్లో సొసైటీ ఆధ్వర్యంలో నిర్మించే గోదాంల నిర్మాణానికి డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డితో కలిసి భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దశలవారీగా రైతుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరిస్తుందన్నారు. గిరిగాం గ్రామానికి బీటీరోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో భీంపూర్ జెడ్పీటీసీ సుధాకర్, ఎంపీపీ సంతోశ్, అర్లి, గిరిగాం సర్పంచ్‌లు రమ, గజానన్, సొసైటీ సీఈవో కేశవ్, గోవర్ధన్ రెడ్డి, అనిల్, శ్రీధర్‌రెడ్డి, నాగయ్య, వెంకన్న పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి చేయాలి

ఇంద్రవెల్లి: మండలంలోని మర్కగూడ గ్రామాభివృద్ధికి కృషి చేయాలని ఇంద్రవెల్లి మండలంలోని మర్కగూడ గిరిజనులు జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్‌కు విన్నవించారు. సోమవారం ఉట్నూర్ జెడ్పీ చైర్మన్ నివాసానికి సందర్శించి సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలన్నారు. సీసీరోడ్లు, డ్రైయినేజీ నిర్మించి అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ జునైద్, గ్రామస్తులు భీంరావ్, కోడప బాపురావ్, కుమ్ర దేవ్‌రావ్, ఆత్రం భీంరావ్, తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి పంచాయతీ కార్మికుల సమ్మె

కైలాస్‌నగర్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, లేదంటే ఈనెల 22 నుంచి సమ్మెకు వెళ్తామని తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ నాయకులు తెలిపారు. సోమవారం జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ కు సమ్మె నోటీసు అందజేశారు. పంచాయతీ కా ర్మికులకు కనీస వేతనం రూ. 26 వేల వేతనం చెల్లించాలన్నారు. కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని కోరారు. ప్రభుత్వం స్పందించి డిమాండ్ల పరిష్కారానికి స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఆశన్న, వెంకట్రావు, శ్రీకాంత్, నాగోరావు, సోనేరావు, దశరథ్, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: 2023–24 సంవత్సరానికి న్యాయ పరిపాలన శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ జిల్లా అధికారి సునితకుమారి ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల షెడ్యూల్డ్ కులాల వారు ఈనెల 30లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు న్యాయశాస్త్ర పట్టాభద్రులు బార్ అసోసియేషన్‌లో సభ్యులుగా ఉండాలని, గ్రామీణ ప్రాంత వారివార్షిక ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారి ఆదాయం రూ.2 లక్షల్లోపు ఉండాలని సూచించారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దివ్యాంగుల నిరసన

కైలాస్‌నగర్: సమస్యలు పరిష్కరించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వ్యవహరించడం సరికాదని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు ఇమ్రాన్ అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా కొనసాగుతోంది. సోమవారం అర్థనగ్న ప్రదర్శన నిర్వహించారు. అధికారులు స్పష్టమైన ప్రకటన చేసేంతవరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

విద్యార్థులకు ఘన స్వాగతం

నార్నూర్: ఈఏడాది విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో తొలిరోజు సోమవారం పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు జామ్‌డా బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చౌహాన్ నెహ్రూ, ఉపాధ్యాయులు పుష్పాగుచ్ఛాలు, బెలూన్లతో ఘన స్వాగతం పలికారు. ప్రైవేట్‌కు ధీటుగా విద్యాబోధన చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు విశ్వనాథ్, చంపాబాయి, పుష్పాలత తదితరులున్నారు.

ప్రజా ఫిర్యాదుల విభాగానికి అధికారుల డుమ్మా

కైలాస్‌నగర్: కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల విభాగం సోమవారం అధికారులు రాక వెలవెల బోయింది. తమగోడును చెప్పుకునేందుకు అర్జీదారులు హాజరైనప్పటికీ ఉన్నతాధికారులెవరూ రాలేదు. దీంతో సమావేశ మందిరంలో కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. ఉట్నూర్ ఆర్డీవో కదం సురేశ్, కలెక్టరేట్ ఏవో అరవింద్‌కుమార్ బాధితుల నుంచి అర్జీలను స్వీకరించారు. సంబంధిత అధికారులు లేకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు.

'ఉత్సవాలు నిర్వహించే హక్కు లేదు'



నినాదాలు చేస్తున్న నాయకులు

ఎదులాపురం: ప్రజలకు ఇచ్చిన హామీలు, సమస్యలు పరిష్కరించని తెలంగాణ ప్రభుత్వానికి దశాబ్ది ఉత్సవాలు నిర్వహించే హక్కు లేదని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులు జగన్‌సింగ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని అమర వీరుల స్థూపానికి నివాళులర్పించారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని, నిరుద్యోగాన్ని పెంచిందన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు, రుణమాఫీ పేరుతో ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సాయికుమార్, కొమ్ర అశోక్, ఆత్రం వినోద్ ఉమ్రే నితిన్, ఉత్తం, కపాకర్, రవీందర్, గజానంద్, మడావి రవి పాల్గొన్నారు.

గర్భిణులు జాగ్రత్తలు పాటించాలి



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

నార్నూర్: గ్రామాల్లో గర్భిణులు, బాలింతల జాగ్రత్తలు పాటించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి రాంబాబు అన్నారు. సోమవారం మండలంలోని గుంజాలలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్తం తక్కువగా ఉండడంతో వెంటనే మెరుగైన వైద్యం కోసం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. ఆశ కార్యకర్తలతో పాటు ఏఎన్ఎంలు ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలుసుకొని అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట హెచ్ఈ చౌహాన్ నాందేవ్, సూపర్‌వైజర్ చరణ్‌దాస్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

క్రీడా సామగ్రి పంపిణీ

బోథ్: తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు సోమవారం యువతకు క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. క్రికెట్, ఫుట్‌బాల్, వాలీబాల్ కిట్లను అందజేశారు. పీఏసీఎస్ చైర్మన్ కదం ప్రశాంత్, శ్రీధర్‌రెడ్డి, ఇర్ల అఖిల్, ఉప్పు ఉదయ్ కుమార్, తుల అభిలాష్, తుల హరీష్ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

నేరడిగొండ: నేరడిగొండ మండలంలో మంగళవారం బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు పర్యటించనున్నట్లు ఎంపీపీ రాథోడ్ సజన్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని కిష్టాపూర్, శంకరపూర్, లింగట్ల గ్రామాల్లో బీటీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తారని పేర్కొన్నారు.

సరుకులు పంపిణీ

ఇంద్రవెల్లి: మండలంలోని దస్నాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని కోయల్‌పాండ్రి గ్రామంలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కురిసిన భారీ వర్షానికి ఇళ్ల పైకప్పు ఎగిరిపోయాయి. సోమవారం ఖానాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకుడు పెందోర్ ప్రభాకర్ బాధిత కుటుంబాలకు పరామర్శించి, నిత్యావసర సరుకులు అందజేశారు.

ఆర్థిక సాయం

బోథ్: మండలంలోని సొనాల గ్రామానికి చెందిన మోతె సునీల్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. గతకొంత కాలం కోమాలో ఉండి ఇటీవల కోలుకున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు బాధిత కుటుంబానికి రూ. 5 వేల ఆర్థిక సాయం అందించారు.

పరామర్శ

తలమడుగు: మండలంలోని కుచులాపూర్ గ్రామానికి చెందిన దోడ రాములు కుమారుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ఖోడద్‌లో..

ఖోడద్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ మైనార్టీ నాయకులు, మండల కోఆప్షన్ మెంబర్ బాబుఖాన్ రోడ్డు ప్రమాదంలో చేతి విరిగి సర్జరీ చేసుకొని ఇంటికి రావడంతో ఆయనను జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి పరామర్శించారు.

నేరడిగొండ: మండలంలోని పెద్దబుగ్గారం గ్రామానికి చెందిన యూత్ అధ్యక్షుడు గజ్జల అశోక్ తల్లి రాజుబాయి మృతి చెందారు. విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ సోమవారం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

తలమడుగు: దివ్యాంగుల పింఛన్ రూ. 1000 పెంచడంతో మండల కేంద్రంలో సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు చిత్రపటానికి బీఆర్ఎస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ తోట వేంకటేశ్, తాటిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, వెల్మ శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీఆర్టీ నియామకాల్లో అవకాశం కల్పించాలి

నేరడిగొండ: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో సీఆర్టీ, నాటీచింగ్ పోస్టుల్లో గిరిజనులకు అవకాశం కల్పించాలని లంబాడా ఐక్యవేదిక (లైవ్) జిల్లా అధ్యక్షుడు జాదవ్ మహేందర్ నాయక్ ఒక ప్రకటనలో కోరా 90 శాతం పోస్టులు గిరిజనులకు కేటాయించాలన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని వినతి

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్, అంబేద్కర్‌నగర్ వార్డుల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని వైఎస్సార్ టీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ అస్లాం డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఏవో అరవింద్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. రోడ్డు, డ్రైయినేజీ సౌకర్యం లేక కాలనీవాసులు ఇబ్బంది పడాల్సిన వస్తోందన్నారు.

డంపింగ్‌యార్డు పరిశీలన

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ మేజర్ గ్రామ పంచాయతీలోని ఎన్‌టీఆర్‌నగర్‌లో జనవాసాలకు ఆనుకొని నిర్మించిన డంపింగ్‌యార్డును కాంగ్రెస్ ఎస్సీసెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ కొమ్ము విజయ్, నియోజకవర్గ నాయకులు పెందూర్ ప్రభాకర్, సర్పంచ్ జాదవ్ సునీల్ పరిశీలించారు. మూడు ప్రభుత్వ రెసిడెన్షియల్ కాలేజీలు డంపింగ్‌యార్డును ఆనుకొని ఉన్నాయన్నారు. పిల్లల భవిష్యత్‌తో ప్రభుత్వం చెలగాటం ఆడుతుందన్నారు.

బీసీలకు రుణాలు అందించాలి

తలమడుగు: రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులవృత్తులతో పాటు అన్నివర్గాల వారికి రుణాలు అందించాలని బీసీ సంఘం నాయకులు సోమవారం తహసీల్దార్ వనజా రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కులవృత్తులకు దరఖాస్తుకు గడువును పొడిగించాలన్నారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను అధికారులు అందించాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం నాయకులు రవికాంత్, వెంకన్న, గాజుల సాంబశివ్, అసం రవీందర్, శశికాంత్ యాదవ్, వినోద్ పాల్గొన్నారు.